క్లుప్తంగా

వార్డు మెంబర్ స్థానానికి పోటీ

పెదపూడి: మండలంలోని కాండ్రేగులలో 3వ వార్డు మెంబర్ స్థానానికి పోటీ నెలకొందని ఎన్నికల స్టేజ్ 1, 2 అధికారి ఎల్.గణేష్‌బాబు తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ స్థానానికి నాలుగు నామినేషన్లు దాఖలు కాగా ఇద్దరు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారని చెప్పారు. దీంతో పేపకాయల ప్రవీణ్, పేపకాయల సాయిబాబు మధ్య పోటీ నెలకొందన్నారు. ఈ నెల 19న ఎన్నిక నిర్వహించి అదే రోజు ఫలితాలు ప్రకటిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.విజయభాస్కర్, సచివాయల కార్యదర్శులు యాళ్ల ఉమామహేశ్వరరావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖరస్వామికి అభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో చంద్రశేఖరస్వామి

రంగంపేట: మండలంలోని చండ్రేడులో కొలువైయున్న శ్రీకాత్యాయనీ సమేత చంద్రశేఖర స్వామివారికి మాసశివరాత్రిని పురస్కరించుకుని ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

పాఠశాలకు సౌండ్ సిస్టం వితరణ


గోకవరం జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులకు సౌండ్ సిస్టమ్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

గోకవరం: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌కు 1992–97 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు రూ.70 వేల విలువ గల సౌండ్ సిస్టమ్‌ను బహూకరించారు. సోమవారం ఉదయం పూర్వ విద్యార్థులు ఈ సౌండ్ సిస్టమ్‌ను పాఠశాల ఉపాధ్యాయ సిబ్బందికి అందజేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలకు తమ వంతుగా ఏదైనా చేయాలని సంకల్పించి స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ సౌండ్ సిస్టమ్‌ను అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తోట త్రిమూర్తులు, కర్రి శివ, మండిగ శ్రీనివాస్, జక్కా చిన్ని, పంపన ధర్మరాజు, వీరబాబు, దాసరి వీరభద్రరావు, మొగడ వీరబాబు, జక్కా జయరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ గోదావరి జలాలు అందిస్తా..

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- 970 మందికి ఇళ్ల స్థలాల పంపిణీ


పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దంపతులు

రాజానగరం: వచ్చే మూడేళ్లలో నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా గోదావరి జలాలను అందిస్తానని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. స్థానిక పంచాయతీ పరిధి శ్రీరామనగర్, రాజానగరం, సూర్యారావుపేటకు చెందిన 970 మంది పేదలకు వెలుగుబంద సమీపంలో చాగల్నాడు ప్రధాన కాలువకు చేర్చి ఉన్న జగనన్న లేఅవుట్‌లో (25 ఎకరాలు) ఇళ్ల స్థలాలను ఎమ్మెల్యే తన సతీమణి డాక్టర్ రాజశ్రీతో కలసి సోమవారం పంపిణీ చేశారు. నివాస స్థలానికి సంబంధించిన పట్టాతో పాటు పసుపు, కుంకుమలను ఆడపడుచులుగా లబ్ధిదారులైన మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే తలంపుతో గతంలో ఏ పాలకులు, ప్రభుత్వాలు చేపట్టని రీతిలో రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి 31.75 లక్షల మందికి ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారన్నారు. ఇలా నియోజకవర్గంలో సుమారు 20 వేల మందికి ఇచ్చామన్నారు. రూ.కోట్ల విలువైన భూములను సైతం పేదల సొంతిళ్ల కోసం పంచిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాజానగరం మండలంలో కలిసి ఉన్న పూర్వపు కడియం అసెంబ్లీ నియోజకవర్గంలో తన తండ్రి రామ్మోహనరావు మూడుమార్లు ఎమ్మెల్యేగా, రెండుమార్లు మంత్రిగా పనిచేశారని ఎమ్మెల్యే అన్నారు. ఆయన హయాంలో రాజానగరం మండలంలో అనేక అభివృద్ధి పనులు జరిగాయన్నారు. తన తండ్రి బాటలోనే పయనిస్తున్నానన్నారు. నాలుగున్నరేళ్లలో రాజానగరంలో రూ.15.96 కోట్లతో పలు అభివృద్ధి పనులను చేశామని తెలిపారు. ఐదేళ్ల టీడీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పనులకు కేవలం రూ. 60 లక్షలు వెచ్చించారన్నారు. అనంతరం ఇళ్ల స్థలాల కోసం తమ భూములిచ్చిన రైతులను ఎమ్మెల్యే రాజా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు

రాజానగరం, శ్రీరామపురం, సూర్యారావుపేటలలో రూ. 8.38 కోట్లతో నిర్మించిన 21 అభివృద్ధి పనులను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, జీఎస్ఎల్ వైద్య కళాశాల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావుతో కలసి ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, వైస్ ఎంపీపీ కొల్లి సత్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, సర్పంచ్ కుందేటి ప్రసాద్, ఉప సర్పంచ్ కొల్లి వీర్రాజు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల చిత్రలేఖనం

అనపర్తి: ఊరూవాడా స్వాతంత్య్ర వేడుకలకు సిద్ధమవుతున్న వేళ ప్రతిఒక్కరూ వివిధ రూపాల్లో దేశభక్తిని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. అనపర్తికి శ్రీ సత్య డ్రాయింగ్ అకాడమీ నిర్వాహకులు మందపల్లి సత్యానందం స్వాతంత్య్ర దినోత్సవంపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పలువురు విద్యార్థులు పాల్గొని దేశభక్తి ఇతివృత్తంగా వివిధ రకాల చిత్రాలు గీసి ప్రతిభ కనబరిచారు. విద్యార్థుల కుంచె నుంచి జాలువారిన చిత్రాలను ప్రదర్శించగా విశేషంగా ఆకట్టుకున్నాయి.



రామవరం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి వెంకట త్రివిక్రమ్ రూపొందించిన చిత్రం


మండపేట బాలికల హైస్కూల్ విద్యార్థిని మౌనిక గీసిన చిత్రం


విద్యార్థి శ్రీచరణ్ గీసిన చిత్రం

ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలి


గోకవరంలో నా భూమి, నా దేశం కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి, తదితరులు

గోకవరం: ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని ఎంపీపీ సుంకర శ్రీవల్లి అన్నారు. గోకవరం పంచాయతీ కార్యాలయంలో సోమవారం నా భూమి నా దేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ కొమరం శ్రావణి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముఖ్యఅతిథిగా పాల్గొని శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం స్వాతంత్య్ర సమరంలో ప్రాణాలు అర్పించిన వీరులకు వందనం తెలిపారు. దేశ సమగ్రతను కాపాడతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో భాగంగా కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. అలాగే మట్టిని సేకరించి ఢిల్లీకి పంపించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు, పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, ఎంపీడీఓ కె.పద్మజ్యోతి, ఈఓపీఆర్డీ రాజేశ్వరరావు, కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు, స్థానిక నాయకులు పులపర్తి బుజ్జి, తోలేటి రాంప్రసాద్, తుమ్మల శివాజీ, పదిలం అప్పారావు, వనం సురేఖ, బొడ్డపాటి వీరచంద్రం, మండపాటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆజాదీకా అమృత్ మహోత్సవ్


మొక్క నాటుతున్న ఎంపీడీఓ హిమమహేశ్వరి, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి

రంగంపేట: కోటపాడులో ఉపాధి హామీ పథకం సిబ్బంది ఆధ్వర్యంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా భూమి–నా దేశం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమ శిలా ఫలకాన్ని గ్రామ పంచాయతీ వద్ద మండల పరిషత్ విప్ సుంకర అప్పారావు ఆవిష్కరించారు. స్థానిక చెరువు గట్టుపై 75 కొబ్బరి మొక్కలు నాటారు. అనంతరం గ్రామ పంచాయతీ వద్ద సర్పంచ్ గవరసాని లక్ష్మీదుర్గ జాతీయ జెండా ఆవిష్కరించారు.

అనపర్తి: రామవరం గ్రామ పరిధిలో నా భూమి–నా దేశం, వసుధకు నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి ముఖ్య అతిథిగా పాల్గొని శిలాఫలకాన్ని ఆవిష్కరించి మొక్కలు నాటారు. ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, సర్పంచ్ గిరడా గంగాభవాని జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ సైన్స్ టెక్నాలజీ కళాశాల ప్రాంగణంలో విత్తనాలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ –1 ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో వివిధ రకాల కూరగాయ విత్తనాలను వేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.విజయనిర్మల పాల్గొన్నారు.

బిక్కవోలు: ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి పెంచాలని ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి అన్నారు. సోమవారం మండలంలోని తొస్సిపూడిలో నిర్వహించిన నా భూమి–నా దేశం కార్యక్రమంలో ఆమె పాల్గొని శిలాఫలకం ఆవిష్కరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు రొంగల పద్మావతి, ఎంపీటీసీ తేతల సుమ, వైఎస్సార్ సీపీ మహిళ అధ్యక్షురాలు కర్రి వరలక్ష్మి, అప్పాజీ పాల్గొన్నారు.

బెల్టు షాపులపై పోలీసుల దాడి

మధురపూడి: మండలంలో బెల్టు షాపులపై ట్రైనీ ఐపీఎస్ పంకజ్‌కుమార్ మీనా, ఎస్సై కట్టా శారదా సతీష్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం దాడులు చేశారు. అనుమతులు లేకుండా మద్యం అమ్మకాలు సాగిస్తున్న ఐదుగురిని అరెస్టు చేసి రూ.53,493 విలువైన 309 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో కోరుకొండ బస్టాండు సెంటర్, చిన్న ఆంజనేయ స్వామి ఆలయం సమీపం, కాపవరం పెట్రోల్ బంకు వద్ద బెల్టు షాపులు నిర్వహిస్తున్న ముగ్గురు, కోటికేశవరం, రాఘవపురంలో ఒకొక్కరు ఉన్నారు. నిడిగట్ల గ్రామంలో పది లీటర్ల సారాతో దారా చిన్న శేషును పోలీసులు అరెస్టు చేశారు

ప్రాపర్టీ కార్డులతో ఎన్నో ఉపయోగాలు

రంగంపేట: ప్రభుత్వ స్వామిత్ర సర్వే నిర్వహించి యజమానులకు అందజేస్తున్న ప్రాపర్టీ కార్డులతో ఎన్నో ఉపయోగాలున్నాయని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. సోమవారం సుభద్రంపేట సచివాలయం వద్ద సర్పంచ్ కూటి సాయితాతారావు ఆధ్వర్యంలో జరిగిన ప్రాపర్టీ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గృహ యజమానులకు దస్తావేజులు ఎలాగో ఈ ప్రాపర్టీ కార్డులు కూడా అంతేనని చెప్పారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి మణికుమార్, ఈఓపీఆర్డీ నల్లమిల్లి కాత్యాయని, దుళ్ల అబ్బులు పాల్గొన్నారు.

గోకవరం ప్రభుత్వాస్పత్రిని తనిఖీ చేసిన అసిస్టెంట్ కలెక్టర్

గోకవరం: స్థానిక ప్రభుత్వాస్పత్రిని సోమవారం తూర్పుగోదావరి జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ యస్వంత్ కుమార్ డీసీహెచ్ డాక్టర్ సనత్‌కుమారితో కలిసి తనిఖీ చేశారు. ఆస్పత్రిలో అందించే సేవల గురించి వైద్య సిబ్బందిని ఆరా తీశారు. ఆరోగ్యశ్రీ పథకం రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో నిర్వహించిన శస్త్ర చికిత్సలు, ఇతర వైద్య సేవలపై వైద్య సిబ్బందిని అభినందించారు. నిర్మాణంలో ఉన్న ఆస్పత్రి భవనాన్ని పరిశీలించి సెప్టెంబర్ నెలాఖరు నాటికి నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ప్రధాన వైద్యురాలు డాక్టర్ వనజకుమారి, ఇతర వైద్య సిబ్బంది డాక్టర్ రవి, డాక్టర్ ఝూన్సీ, డాక్టర్ గంగాధర్, డాక్టర్ రామలక్ష్మీ, డాక్టర్ భార్గవి, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వార్డు సభ్యుల ఎన్నిక ఏకగ్రీవం


నాగంపల్లిలో సుబ్రహ్మణ్యంకు నియామక పత్రం అందిస్తున్న రిటర్నింగ్ అధికారి గోపాల్

సీతానగరం: నాగంపల్లి పంచాయతీ వార్డు సభ్యులుగా నామినేషన్ వేసిన ముగ్గురిలో ఇద్దరు విత్‌డ్రా చేసుకోవడంతో ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. ఇక్కడి ఒకటో వార్డుకు దూళ్ల సుబ్రహ్మణ్యం, దోసపాటి కాశీ కృష్ణభగవాన్, ఈత సత్యనారాయణ ప్రసాద్ నామినేషన్లు వేయగా ఇద్దరు విత్‌డ్రా కావడంతో దూళ్ల సుబ్రహ్మణ్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్టేజ్–1 రిటర్నింగ్ అధికారి వైఎస్ఎన్ గోపాల్ ఆయనకు నియామక పత్రాన్ని అందించారు. అదే విధంగా రాపాక ఏడో వార్డుకు మాగంటి నాగమణి, రఘుదేవపురం ఒకటో వార్డుకు కొండ్రు బుజ్జిల ఎన్నిక ఏకగ్రీవం కావడంతో స్టేజ్–2 రిటర్నింగ్ అధికారి వి.అవినాష్ నియామక పత్రాన్ని ఇచ్చారు.

ఓటర్ల జాబితా సర్వేను బాధ్యతగా చేపట్టాలి


పెదపూడిలో ఓటర్ల క్లెయిమ్స్‌ను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్

పెదపూడి: రానున్న సార్వత్రిక ఎన్నికలకు కచ్చితమైన ఓటర్ల జాబితా సిద్ధం చేయడానికి బీఎల్ఓలు, ఇతర అధికారులు సమగ్ర ఓటర్ల జాబితా సర్వేను బాధ్యతగా చేపట్టాలని అనపర్తి నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. మండల రెవెన్యూ కార్యాలయంలో ఓటర్ల జాబితాలో సవరణలు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన క్లెయిమ్స్‌ను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి.సుభాష్, డీటీ రామ్‌కుమార్, ఆర్ఐ ఎం.త్రివేణి, వీఆర్వోలు గొల్లపల్లి అంజిబాబు, కరెడ్ల రమేష్, పంపన శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.

రామవరం ఉప ఎన్నిక ఏకగ్రీవం


కర్రి రుక్మిణి కుమారి

అనపర్తి: మండలంలోని రామవరం పంచాయితీ 3వ వార్డు మెంబర్ స్థానానికి కర్రి రుక్మిణి ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఉప ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి తెలిపారు. కర్రి రుక్మిణిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి, సర్పంచ్ గిరడా గంగాభవాని అభినందించారు.

- మండలంలోని దుప్పలపూడి 1వ వార్డుకు నలుగురు, 9వ వార్డుకు నలుగురు సభ్యులు నామినేషన్లు దాఖలు చేసినా నామినేషన్ల ఉపసంహరణ తరువాత ఇద్దరేసి చొప్పున పోటీలో ఉన్నారు. 1వ వార్డులో ఎన్నికల బరిలో నిలిచిన వల్లభశెట్టి శివపద్మినికి గౌను గుర్తు, సిరపల్లి అమలకు ప్రెషర్ కుక్కర్, 9వ వార్డు పోటీలో ఉన్న దొండపాటి మణికంఠకు గౌను, చిర్ల త్రినాథరెడ్డికి ప్రెషర్ కుక్కర్ గుర్తులు కేటాయించినట్లు ఎన్నికల అధికారి బి.పుష్పలత ప్రకటించారు.

గైట్ కళాశాల విద్యార్థుల ర్యాలీ


దివాన్‌చెరువు కూడలిలో మానవహారంగా ఏర్పడిన గైట్ విద్యార్థులు

రాజాన గరం: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ముగింపు కార్యక్రమంలో భాగంగా గైట్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు దివాన్‌చెరువులో సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం జాతీయ రహదారి కూడలిలో జాతీయ జెండాను ప్రదర్శిస్తూ, మానవహారంగా ఏర్పడ్డారు. అదేవిధంగా గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ముగింపు కార్యక్రమం జరిగింది.

గోకవరంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పర్యటన

గోకవరం: గోకవరానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని ఎంపీపీ సుంకర శ్రీవల్లి జగ్గంపేట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రానాయుడుకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థాపన కోసం జిల్లా కలెక్టర్, ఆర్‌జేడీ ఆదేశాల మేరకు చంద్రానాయుడు సోమవారం గోకవరంలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న అధికారులు, నాయకులను కలుసుకుని అభిప్రాయ సేకరణ చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్య, చుట్టు పక్కల గ్రామాల నుంచి ఎంత మంది విద్యార్థులు ఇక్కడకు చదువుకోవడానికి వస్తున్నారన్న విషయాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనను ఎంపీపీ, స్థానిక నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకుని గోకవరానికి డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

స్పందనకు రెండు అర్జీలు

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన స్పందనకు రెండు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ రాజు, ఎంపీడీఓ కె.రమేష్ సోమవారం తెలిపారు. వీటిని సంబంధిత శాఖలకు అందించి పరిష్కరిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు

సీతానగరం: మునికూడలి వద్ద స్కూటీని ఆటో ఢీకొట్టగా భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయని ఆసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు సోమవారం తెలిపారు. దివాన్‌చెరువు నుంచి వేమగిరి నాగేశ్వరరావు తన భార్యతో ఆదివారం స్కూటీపై రఘుదేవపురం వస్తుండగా వెనుక నుంచి ఆటో ఢీకొంది. ఇద్దరికీ తీవ్ర గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

50 మంది రక్తదానం

బిక్కవోలు: బిక్కవోలు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం సమీపంలోని అతిథి గృహం వద్ద నవసేన ఉమెన్ అండ్ సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం రక్తదానం శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి ప్రారంభించారు. కాకినాడ శ్రీఅభయ బ్లడ్ బ్యాంకు వైద్యులు 50 మంది నుంచి రక్త సేకరణ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షురాలు డాక్టర్ షేక్ ఫర్హా కౌసర్, రాజీవ్ పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళి


రఘుదేవపురంలో నా భూమి- నా దేశం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

సీతానగరం: రఘుదేవపురం, పురుషోత్తపట్నం, రాపాక, నల్గొండ, నాగంపల్లి, చీపురపల్లి తదితర గ్రామాల్లో ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా భూమి, నా దేశం శిలాఫలకాలను ఆవిష్కరించారు. అమర వీరులకు నివాళి అర్పించారు. అనంతరం ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, ఎంపీడీఓ కె.రమేష్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ కె.నాగ శేషవేణి, సర్పంచులు తదితరులు మొక్కలను నాటారు. పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కోకన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు, నాయకులు చల్లమళ్ళ సుజీరాజు, గెద్దాడ త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు